సాక్షి పల్నాడు

బుధవారం। 2 । ఏప్రిల్ । 2025



శిలువ పాదయాత్ర


నాదెండ్ల: ఇర్లపాడు విచారణ ఆర్‌సీఎం సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామం నుంచి కనపర్రు బాలయేసు పుణ్యక్షేత్రం వరకు శిలువ పాదయాత్ర నిర్వహించారు.



రేపు బ్రహ్మంగారి ఆరాధన తిరునాళ్ల

కర్లపాలెం: ఏట్రవారిపాలెం గ్రామంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన తిరునాళ్ల గురువారం జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



నిజాంపట్నం: అడవుల దీవి గ్రామంలో వేంచేసియున్న అనంత సాయిబాబా మందిర 15వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బాబాకు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

వారంలోపు రీసర్వే పూర్తి చేయండి

జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే



నరసరావుపేట: జిల్లాలో 25 పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వే వారం రోజుల్లోగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. వాస్తవ భూ హక్కుదారుల సమాచారాన్ని సర్వేలో నమోదైన వివరాలను సరిచేసి గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తిచేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో రెవెన్యూ, సర్వే, పౌర సరఫరాల శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రెండవదశ గ్రామాల ఎంపిక పూర్తిచేసి గ్రామ సరిహద్దులు నిర్ణయించే కార్యక్రమం ప్రారంభించాలన్నారు. రేషన్ కార్డుదారుల ఈ-కేవైసీ వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి నారదముని, ఆర్డీఓ మధులత, సర్వే ఏడీ భానుకీర్తి, తహసీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ల వద్ద ఫ్యాప్టో ధర్నా

ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు ఎస్ఎం సుభాని



సత్తెనపల్లి: రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ఈ నెల 2వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించటం జరుగుతుందని ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు ఎస్ఎం సుభాని మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల కలెక్టరేట్‌ల ఎదురు ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసి (ఫ్యాప్టో) ధర్నా చేయడానికి సిద్ధమయ్యాయన్నారు. 2023 జూలై ఒకటి నుంచి ఇవ్వవలసిన 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, ఐఆర్ 30 శాతం, బకాయి ఉన్న మూడు డీఏలు, ఎర్న్‌డు లీవులు, ఎరియర్స్ రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలన్నారు. వీటి విడుదల కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సుభాని కోరారు.

ముగిసిన 'పది' పబ్లిక్ పరీక్షలు

చివరిరోజు పరీక్షకు 99.04 శాతం హాజరు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు పల్నాడు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. జిల్లావ్యాప్తంగా 128 పరీక్షా కేంద్రాలలో మంగళవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 25,512 మంది విద్యార్థులకు గాను 25,269 మంది హాజరయ్యారు. పరీక్షలు పూర్తి కావటంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్ద సందడి చేశారు. ఒకరికొకరు అభినందనలు తెలుపుకొని కొద్దిసేపు పరీక్షా కేంద్రాల వద్దే గడిపారు. కాగా, పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన 6 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 45 కేంద్రాలను తనిఖీ చేశాయి. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మండలంలోని 2 కేంద్రాలు, జిల్లా పరిశీలకులు ఎస్.గీత చిలకలూరిపేట, నాదెండ్ల, నరసరావుపేట మండలాల్లోని 7 కేంద్రాలు, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఎ.హుస్సేన్ పట్టణంలోని 4 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ చంద్రకళ తెలిపారు. పరీక్షలను సజావుగా నిర్వహించటంలో సహకరించిన సిబ్బందికి, పోలీస్, రెవెన్యూ, వైద్య, ఆర్టీసీ ఇతర శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయ పండుగ



నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో కొలువైయున్న రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట నిర్వహించి మంగళవారం నాటికి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పలువురు పీటలపై కూర్చుని పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, జంపని లక్ష్మీనారాయణ, తమ్మ సీతయ్య, చెన్నబోయిన వెంకటసుబ్బారావు, వజ్జా రామారావు, నర్రా శ్రీనివాసరావు, గొర్రె సాంబశివరావు, ఈదర పూర్ణచంద్రరావు, ఈదర కోటయ్యస్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అందరి లెక్కలు తేలుస్తాం

- మా నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం
- అధికారంలోకి వచ్చింది అభివృద్ధి చేసేందుకా.. లేక తప్పుడు కేసులు పెట్టేందుకా?
- మేము అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పుడు కేసులు పెట్టినవారిపై ప్రత్యేక విచారణ చేయిస్తాం
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- టీడీపీ మూకల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వెంకటరెడ్డికి పరామర్శ



గాయపడిన వెంకటరెడ్డిని ఆస్పత్రిలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, పక్కన చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి చేయటం లేదని ఎవరైనా అంటే అది సీఎం చంద్రబాబునాయుడు చెవిలో చెప్పమంటున్నాడని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని పల్నాడు హాస్పటల్‌లో టీడీపీ మూకల దాడిలో గాయపడిన వెంకటరెడ్డిని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమాలు పక్కన పెట్టి దాడులు, ఘర్షణలే పరమావధిగా కూటమి నేతలు పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరు చేసిన గవర్నమెంట్ కాలేజీని మూలన పడేశారని, పిడుగురాళ్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం టెండర్లు పిలిచినా కానీ పనులు ప్రారంభించలేదన్నారు. కనీసం మేం తెచ్చిన గ్రాంట్ నైనా ఖర్చుచేస్తే గురజాల నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందన్నారు.

ఎవరినీ వదిలిపెట్టం..

జూలకల్లులో ఇప్పటికే నాలుగుసార్లు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేశారన్నారు. తాము అన్నీ గమనిస్తున్నామని, దాడులు చేస్తున్న, చేయిస్తున్న టీడీపీ నేతలందరి లెక్కలు రాస్తున్నామన్నారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు. తప్పు చేస్తే కేసులు పెట్టండి అంతేకానీ పొలాలకు వెళ్లేవారిని, ఏదైనా పని మీద వెళ్లే వారిపై దాడులు చేయటం సరైన పద్ధతి కాదన్నారు. ఏదో బెదిరిస్తే బెదిరిపోతారని కూటమిలోని కొందరు నేతలు అనుకుంటున్నారని రెట్టింపు రీతిలో తాము బదులు ఇస్తామనే విషయం గుర్తించుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, చింతా సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు వీరభద్రుని రామిరెడ్డి, అంజిరెడ్డి, రామిరెడ్డి, సుభాని, సర్పంచ్ ఎల్.అంకారావు, మాచవరం మండలం కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ జాని, మాచవరం మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్మార్గ పాలనకు అంతం తప్పదు

గురజాల: రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గపు పాలనకు అంతం తప్పదని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక సబ్ జైల్‌లో మాచవరం మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు షేక్ చింతపల్లి పెద్ద సైదా, అల్లాభక్షులను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం నాటి ఘటనపై తప్పుడు కేసు పెట్టి ఇబ్బందులు పెట్టడం కూటమి నేతల కుట్రకు నిదర్శనమన్నారు. తెలంగాణలో ఉన్నవారిని పోలీసులు వెళ్లి అక్రమ కేసులో అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి నేతలకు ఎవరిని ఇబ్బందులు పెడదాం, ఎవరిపై తప్పుడు కేసులు పెడదాం అనే ఆలోచనే తప్పితే అభివృద్ధి, సంక్షేమంపై ఏమాత్రం దృష్టి లేదన్నారు.

ప్రత్యేక విచారణ చేయిస్తాం..

తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన పోలీస్ అధికారులపై తాము అధికారంలోకి వచ్చిన తరువాత అదే పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ కేసులు పెట్టిన పోలీస్ అధికారులపై ప్రత్యేక విచారణ జరిపిస్తామన్నారు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేసి రెండు సంవత్సరాలలోపు వారికి శిక్ష పడేలా చూస్తామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, పోలు వీరారెడ్డి, కె.ఆంద్రెయ్య, కె.చిన కోటేశ్వరరావు, ఎం.ప్రసాద్‌రావు, తదితరులున్నారు.

పింఛన్లు తుంచేస్తున్నారు

- జిల్లాలో క్రమంగా తగ్గుతున్న పింఛన్లు
- పది నెలల్లో 10,558 పింఛన్ల తగ్గుదల
- ఈనెల 397 మందికి కోత

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం పింఛను లబ్ధిదారుల సంఖ్యను క్రమేపీ తుంచేస్తోంది. జిల్లాలో క్రమంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పొందే వారి సంఖ్య తగ్గిపోతుంది. గత తొమ్మిది నెలల కాలంలో 10,161మంది లబ్ధిదారులు తగ్గారు. తాజాగా పదో నెల ఏప్రిల్‌లో మరో 397మంది తగ్గారు. ఈనెల 2,71,568 మందికి అందజేయాల్సివుంది. ఒకటో తేదీ మంగళవారం నుంచి జిల్లాలో పంపిణీ మొదలు పెట్టగా సాయంత్రం 5.30నిమిషాలకు 2,45,715 (90.48శాతం) మందికి అందజేశారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దుర్గి మండలంలో స్వయంగా పర్యటించి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం ముగిసి నూతన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జిల్లా వ్యాప్తంగా 2,82,126మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి గతేడాది జూలై మొదటి తేదీన కూటమి ప్రభుత్వం పింఛన్లు అందజేయటం మొదలు పెట్టింది. ఈ పది నెలల్లో 10,558 మంది లబ్ధిదారులు తగ్గటం గమనార్హం.

దుర్గిలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించటం కోసం పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం దుర్గి మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మండల కేంద్రమైన దుర్గిలో మొత్తం 1102 పెన్షన్‌లకు గాను వాటి వివరాలు తెలుసుకొని, స్థానిక ఎస్సీ కాలనీకి వెళ్లి పలువురికి ఆయన చేతుల మీదుగా పెన్షన్‌ను పంపిణీ చేశారు. వివిధ శాఖల అధికారులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఎటువంటి అలసత్వం లేకుండా పథకాల అమలుకు తోడ్పాడాలని ఆదేశించారు. అనంతరం ఓబులేశునిపల్లె, గజాపురం గ్రామాల మధ్యలో పశువుల కోసం నీటి తొట్టెల ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పశువులకు ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టెలను ఉపయోగించుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మవరంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి రైతులను అభినందించారు. ఆయనవెంట ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ ఐ.ఫణీంద్ర కుమార్, డీఎల్‌డీఓ డి.గబ్రూ నాయక్, పీడీ ఎం.సిద్ధలింగమూర్తి, ఏపీడీ మల్లిఖార్జున, ఎంపీడీఓ శివప్రసాద్ ఉన్నారు.



దుర్గి మండలంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

రంగస్థలం.. సర్వం సిద్ధం

4 నుంచి సుందరయ్య కళానిలయం నాటికల పోటీలు

యద్దపాడు: గ్రామస్తులతో కలిసి కళామతల్లికి రెండు దశాబ్దాలకు పైగా సేవలు చేస్తున్నారు యద్దపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నిర్వాహకులు. కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు ఆధ్వర్యంలో ఏటికేడు పోటీల నిర్వహణలో సరికొత్త ధోరణి అవలంబించడం విశేషం. కళానిలయంలో ఈ ఏడాది 22వ జాతీయ స్థాయి నాటికల పోటీల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఈనెల 4,5,6 తేదీల్లో నాటిక పోటీలు జరగనున్నాయి. ఇప్పటికే భారీ వాల్‌పోస్టర్లు, సోషల్‌మీడియా, ఇతర మాధ్యమాల రూపంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

- పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ప్రథమ నాటికకు రూ.28వేలు, ద్వితీయ నాటికకు రూ.26వేలు తృతీయ నాటికకు రూ.24వేలు బహుమతి, అలాగే ప్రదర్శన పారితోషికం రూ.18వేలు, ప్రతి నాటిక రచయితకు రూ.వెయ్యి, ప్రతి నాటిక దర్శకుడికి రూ.వెయ్యి, ఐదుగురు ఉత్తమ నటీనటులకు రూ.వెయ్యి, మరో ఐదుగురు సహాయనటులకు రూ.500, ఉత్తమ దర్శకుడికి రూ.3వేలు, ఉత్తమ రచయితకు రూ.2వేలు, ఉత్తమ రంగాలంకరణ, సంగీత దర్శకులు, ఆహార్యం ఒక్కొక్కరికీ రూ.వెయ్యి ఆర్టిస్టులందరికీ జ్ఞాపికలు ఇవ్వనున్నారు. మహిళా కళాకారులకు ఆదుపడుచు సత్కారం ప్రత్యేకం.
- సెల్‌ఫోన్, టీవీ మాయలో పడుతున్న ప్రేక్షకుల దృష్టిని రంగస్థల వేదికవైపు మళ్లించేందుకు మరో ప్రయత్నం చేస్తున్నారు. గ్రామంలోని ఇంటింటికి పెళ్లి పిలుపులా నాటక పోటీల ఆహ్వాన పత్రాల్ని అందించి సంప్రదాయబద్ధంగా ఆహ్వానిస్తారు. అంతేకాకుండా ప్రతిరోజు పోటీలను వీక్షించేందుకు వచ్చిన ప్రేక్షకులకు అల్పాహార విందు నిచ్చి, ప్రదర్శన అనంతరం రోజుకు 30 మంది చొప్పున మూడు రోజులు 90 మందికి కూపన్లతో లక్కీడ్రా తీసి ఆకర్షణీయమైన బహుమతుల్ని అందిస్తూ కొత్త సంప్రదాయానికి తెరతీశారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

- ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో పరీక్షల నిర్వహణ
- అరగంట ముందు వరకే కేంద్రాల్లోకి అనుమతి
- విద్యార్థుల వస్త్రధారణ, ఆభరణాలపై ఎన్‌టీఏ ఆంక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు అర్హత కల్పించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్-2025 రెండవ సెషన్ పరీక్షలు బుధవారం నుంచి జరగనున్నాయి. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12, తిరిగి మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పేపర్-1 (బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో జరగనున్నాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సీబీటీ ఆన్‌లైన్ పరీక్షల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు నల్లపాడు, పేరేచర్లలోని అయాన్ డిజిటల్ జోన్‌లలో ఏర్పాట్లు చేసింది. అడ్మిట్‌కార్డులు పొందిన విద్యార్థులు అందులో ఎన్‌టీఏ పొందుపర్చిన నియమ, నిబంధనలు క్షుణ్ణంగా చదవాలి.

- ఉదయం పరీక్షకు 7 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంటకు పరీక్షా కేంద్రాలకు చేరుకుంటే మంచిది.
- అరగంట ముందు వరకే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు.
- విద్యార్థులు సాధారణ వస్త్రాలను ధరించాలి. కాళ్లకు సాధారణ చెప్పులను ధరించాలి.
- పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తారు.
- విద్యార్థినులు ఆభరణాలు తీసివేసి వెళ్లడం మంచిది.
- ఎన్‌టీఏ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు కింది భాగంలో ఇచ్చిన ఒక బాక్సులో ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఫోటోను అంటించి, పక్కన ఉన్న బాక్సులో ఎడమ చేతి వేలిముద్ర వేయాలి. మూడో బాక్సులో పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన తరువాత ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేయాలి.
- విద్యార్థి తమ వెంట అడ్మిట్‌కార్డుతోపాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు మరొక పాస్‌పోర్ట్ సైజు ఫోటోను తెచ్చుకోవాలి. ప్రతి విద్యార్థి నుంచి బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తారు. ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌తో పాటు బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాలి. దరఖాస్తు సమయంలో అప్లోడ్ చేసిన ఆధార్, పాన్ తదితర ఒరిజినల్ కార్డును విధిగా తీసుకెళ్లాలి.

యార్డుకు 1,16,203 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,16,035 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,11,203 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,600 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 53,345 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

బాపట్ల జిల్లా ప్రజలకు నిరాశే

- నేను బాగుచేస్తాను.. మళ్లీ వచ్చినోళ్లు చెడగొడుతున్నారు
- పథకాలపై స్పష్టమైన హామీల్లేని ప్రసంగం
- నిరుత్సాహ పరిచిన చంద్రబాబు పర్యటన
- ఎత్తిపోతల పథకాల గురించి పట్టించుకోని సీఎం
- మూడు గంటలు సాగిన పర్యటన



మహిళకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

చీరాల : ముఖ్యమంత్రి హోదాలో రెండోసారి బాపట్ల జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబునాయుడు ప్రజలను నిరుత్సాహపర్చాడు. గతంలో జిల్లాకు ఇచ్చిన హామీల గురించిగానీ, పరిశ్రమల స్థాపన గురించిగానీ ప్రస్తావించకుండా పొంతన లేని మాటలు చెప్పి వెళ్లారు. వచ్చాడు...వెళ్లాడు అనే చందంగా సాగింది సీఎం పర్యటన. పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో మంగళవారం పింఛన్ల కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ గ్రామంలో 304 నివాస గృహాలు ఉన్నారు. 996 మంది జనాభా నివసిస్తున్నారు. 138 పింఛన్లు ఉన్నాయి. తీరప్రాంతంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. కోస్టల్ కారిడార్ ఏర్పాటు చేసి తద్వారా పరిశ్రమలను తీసుకువచ్చి వెనుకబడిన బాపట్ల జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తారని జిల్లాప్రజలు ఆశించారు. చివరకు ఎమ్మెల్యే ఏలూరి సైతం షిప్ బ్రేకింగ్, షిప్ బిల్డింగ్ యూనిట్లు పెట్టాలని కోరినప్పటికీ అవకాశాన్ని బట్టి ప్రయత్నం చేస్తానని చెప్పారే తప్ప గట్టి హామీ ఇవ్వలేకపోయారు. చీరాల్లో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఫిషింగ్ హార్బర్ నిధులు, నిర్మాణం గురించి ఊసే ఎత్తలేదు. బంగారు కుటుంబం, మార్గదర్శులు కావాలంటూ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారే తప్ప ప్రభుత్వం నుంచి పరిశ్రమల ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారు. సెల్‌ఫోన్ నేనే తెచ్చానని మరోసారి చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి ఎత్తిపోతల పథకాలు లేకపోవడం వలన రైతులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తే చంద్రబాబు మాత్రం తాను అన్నీ బాగు చేసి వెళ్తే వచ్చే వారు మళ్లీ చెడగొట్టి వెళ్తున్నారని అనడం చూస్తే ఆయనకు మళ్లీ అధికారంలోకి వస్తారో.... లేదో...అనే అనుమానం ఉన్నట్లు సభకు హాజరైన వారు చర్చించుకోవడం విశేషం. పేదరికంలేని సమాజాన్ని చూపించేందుకు 2029లో కృషి చేస్తానన్నారు. 12.40 గంటలకు ప్రారంభమైన చంద్రబాబు సమావేశం మధ్యాహ్నం 2.45 గంటల వరకు బోరుగా సాగింది. గత ప్రభుత్వం అప్పులు ఇచ్చి వెళ్లింది ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి ఘోరంగా ఉన్నా కానీ సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని ప్రతి సభలో చెప్పిన విధంగానే చినగంజాం సభలో చంద్రబాబు చెప్పుకొచ్చారు.

ఆరోగ్యం బాగోలేకపోయినా మీటింగ్‌కు రండి

కేవలం వ్యాపారవేత్తలకు, బడా వ్యక్తులకు పేదలను దత్తత పంపేందుకే, బడా వ్యాపారవేత్తలు పేదలకు ఏవిధంగా ఆర్థిక చేయూతనివ్వాలో తెలిపేందుకు సభ నిర్వహించారా అని ప్రజలు చర్చించుకున్నారు. పింఛన్ల పంపిణీలో భాగంగా ఎల్లావుల వెంకాయమ్మ ఇంటికి చంద్రబాబు వెళ్లారు. ఆమె కూతురు ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోయినా సీఎం చంద్రబాబు ఆ కుటుంబాన్ని మీటింగ్‌కు రావాలని కోరడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ఆలయంలో పూజలు

కొత్తగొల్లపాలెంలో ఉన్న దేవాలయంలో చంద్రబాబు పూజలు చేశారు. పూజారైన పెద్దగొల్లను మీటింగ్‌కు వద్దకు రావాలని చంద్రబాబు పిలవడం ఆసక్తిగా అనిపించింది.

యువకుడికి వార్నింగ్

ఒక యువకు సీఎం సార్ ప్లీజ్ అంటూ ప్లకార్డు, ఆర్జీ పట్టుకోగా కడుపు నొప్పిగా ఉందా....సమస్య ఉంటే నేరుగా రా....చిల్లర వేషాలు వేస్తే ట్రీట్‌మెంట్ ఇస్తా అని చంద్రబాబు అనడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

సూపర్ సిక్స్ ప్రస్తావనే లేదు

కేవలం పింఛన్ల పెంపుదల చేసింది....పేదలకు 20 రకాలైన పింఛన్లు అందిస్తున్నాని చెప్పడమే కానీ సూపర్ సిక్స్ పథకాలు గురించి కానీ, ఉచిత బస్సుకానీ, మహాలక్ష్మి పథకం కానీ ఎలాంటి ప్రస్తావన చేయకపోవడంతో ప్రజలు నిరాశ పడ్డారు. ఎన్డీఏలో కీలకంగా ఉన్నారు..జిల్లాకు మంచి వరాలు....పేద ప్రజలకు సంక్షేమ పథకాల గురించి గొప్ప హామీలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆశించిన ప్రజలు సీఎం చంద్రబాబు ప్రసంగంతో భంగపాటుకు గురయ్యారు.

ప్రజాధనం వృథా

చంద్రబాబు ఊకదంపుడు ప్రసంగం మినహా ప్రజాసేవ, ప్రజావేదిక వలన జరిగిన ప్రయోజనం మాత్రం లేదని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. కేవలం నలుగురికి పింఛన్లు పంపిణీ చేసేందుకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం చంద్రబాబుకు తగునా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు

కోర్టు ఉత్తర్వులు ఉన్నా ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోని అధికారులు

నకరికల్లు: ఉపాధిహామీ పథకంలో తమను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా చేర్చుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ విధుల్లోకి తీసుకోవడం లేదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేసిన కె.శివగోపి, అవుల సుకన్య, ఎస్.మేరీ వసంతకుమారి, పల్నాటి చెన్నకేశవులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు నకరికల్లు ఎంపీడీఓ జి.కాశయ్యను మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని అకారణంగా అధికారులు తమకు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించినా తీసుకోకపోవడంతో రిజిస్టర్ పోస్టుద్వారా పంపామని అయినా విధుల్లోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమకు అన్యాయం జరిగిందని ఫిబ్రవరిలో హైకోర్టును ఆశ్రయించగా తమను విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ తమను విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ జి.కాశయ్యను వివరణ కోరగా డిపార్ట్‌మెంట్ లీగల్ అడ్వయిజర్‌ను సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నకరికల్లు ఎంపీడీఓ జి.కాశయ్యను కలసి వినతిపత్రం అందించిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు

క్లుప్తంగా

పల్నాడు డీసీహెచ్‌ఎస్ రంగారావు బదిలీ



నరసరావుపేట: జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణ (డీసీహెచ్ ఎస్) ఇన్‌చార్జి అధికారిగా గత ఏడాదిన్నరగా పనిచేస్తున్న డాక్టర్ బీవీ రంగారావు గుంటూరు జిల్లా డీసీహెచ్‌ఎస్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ నం.188 జారీ చేసిందని రంగారావు వెల్లడించారు. కాగా, గత మూడు నెలలుగా ఆయన ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన స్థానంలో డీసీహెచ్‌ఎస్‌గా మరెవరినీ నియమించలేదు.

రైల్వే ఉద్యోగాల ఉచిత శిక్షణకు 5న ప్రవేశ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: రైల్వే శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు రామ్ కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎంవీ రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు గ్రూప్–డీ పరీక్షల ద్వారా వివిధ పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ఈనెల 5న రెండు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు శ్రీధర్ సీసీ ఎఫ్ సంస్థ నేతృత్వంలో మూడు నుంచి నాలుగు నెలల పాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణతోపాటు భోజన, వసతి సదుపాయాలతో పాటు స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూలు నగరాల్లో వంద మార్కులకు నిర్వహించే అర్హత పరీక్షను 90 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ టెలిగ్రామ్ గ్రూపును ఫాలో కావచ్చని, మరిన్ని వివరాలకు 9866 777 870 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోలీస్ శాఖకు కారు బహూకరణ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోలీస్ శాఖ అందించే సేవల్లో దాతలు భాగస్వాములు కావాలని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎస్పీ సతీష్‌కుమార్‌కు కారు పత్రాలు, తాళాలను పయనీర్ ఆటోమొబైల్స్ అధినేత చుక్కపల్లి రమేష్ అందించారు. ఈ మేరకు దాతలైన పయనీర్ ఆటోమొబైల్స్ అధినేత చుక్కపల్లి రమేష్, చేబ్రోలు హనుమయ్య కుమారుడు చేబ్రోలు నరేంద్ర, భారతి కన్స్యూమర్ కేర్ ప్రొడక్ట్స్ (ట్రిపుల్ ఎక్స్) అధినేత దివంగత మాణిక్యవేల్‌కు జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణా ఐపీఎస్ అధికారిణి దీక్ష, జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), సుప్రజ (క్రైం), డీఎస్పీలు భానోదయ (దక్షిణ), ఏడుకొండలురెడ్డి (ఏఆర్), నల్లపాడు పీఎస్ సీఐ వంశీధర్, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

జీవన సత్యాన్ని చాటిన 'జేబు చెప్పిన ఊసులు'


'జేబు చెప్పిన ఊసులు' నాటకంలో సన్నివేశం


కె.విజయలక్ష్మికి జీవనసాఫల్య పురస్కారం

- ఆలోచింపజేసిన సాంఘిక నాటకం
- జాతీయస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం
- విశాఖ నటి, రచయిత్రి, దర్శకురాలు విజయలక్ష్మికి ఎన్టీఆర్ జీవనసాఫల్య పురస్కారం

తెనాలి: పట్టణానికి చెందిన డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ ఆధ్వర్యంలో 14వ జాతీయస్థాయి నాటకోత్సవాలు మంగళవారం రాత్రి ఏడు గంటలకు ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఏర్పాటైన నాటకోత్సవాలను ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. తొలిరోజున సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి 'జేబు చెప్పిన ఊసులు' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. 'జేబు నిండుగా ఉంటే మనకు అందరూ ఉంటారు.. అదే జేబు ఖాళీ అయితే మనకోసం ఎవరూ ఉండరు.. జీవితం చివరి రోజుల్లో భరోసా ఉండదు' అనే నిజాన్ని అర్థవంతంగా చెప్పిందీ నాటకం. మన దగ్గర మనసుంది...మమకారం ఉంది.. వాటితోపాటు డబ్బును కూడా కాపాడుకోవాలనేది నాటక సందేశం. మనిషనేవాడు జాగ్రత్త పడుతూండాలి.. తనకోసం కూడా ఆలోచించుకోవాలి.. విలువైన డబ్బును తన కోసం కొంతయినా జాగ్రత్త చేసుకోవాలి.. ఆ డబ్బే చివరి దశలో ఆసరా అవుతుంది.. లేకుంటే జీవితంలో అభద్రత చోటుచేసుకుంటుంది.. జేబులు చెప్పే నిజాలను పట్టించుకోవాలంటూ 'జేబు చెప్పిన ఊసులు' నాటకం మనిషి ఎలా బతకాలో ఎలా బతకకూడదో తెలియచెప్పిన వాస్తవ ఘటనల సమాహారంగా ప్రేక్షకుల ప్రశంసలను అందుకుంది. స్నిగ్ధ రచించిన నాటకాన్ని మంజునాథ్ దర్శకత్వంలో ప్రదర్శించారు. ప్రధాన పాత్రల్లో ఎస్‌డీ బాషా, మంజునాథ్, ప్రశాంత్, మల్లాది భాస్కర్, ఆకెళ్ల గోపాలకృష్ణ, కె.శ్రీదేవి నటించారు. సంగీతం నాగరాజు, లైటింగ్ ఉమాశంకర్. నాటకం తదుపరి జరిగిన సభకు కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల, సినీనటుడు నాయుడుగోపి అధ్యక్షత వహించారు. ఈ సభలో విశాఖపట్నానికి చెందిన ప్రముఖ రంగస్థల నటి, రచయిత్రి, దర్శకురాలు కె.విజయలక్ష్మికి ఎన్టీఆర్ జీనవ సాఫల్య పురస్కారాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. విశ్రాంత పోస్టల్ సూపరింటెండెంట్ కె.రమేష్, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పీఎస్సార్ బ్రహ్మాచార్యులు, కోశాధికారి ఎ.పోతురాజు పాల్గొన్నారు. కళాపరిషత్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు పర్యవేక్షించారు.

వలంటీర్లను దారుణంగా వంచించిన బాబు

సామాజిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్

నరసరావుపేట: గతేడాది ఉగాదినాడు వలంటీర్లకు తీపి కబుర్లు చెప్పి, వారికి చెందిన దాదాపు పది లక్షల ఓట్లను బుట్టలో వేసుకుని ఎన్నికల్లో గెలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన మొదటి ఉగాదికైనా ఏదో ఒక కబురు చెబుతాడని ఆశించిన వలీంటర్లకు భంగపాటే ఎదురైందని సామాజిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ఆదివారం ఉగాది సంబరాలలో చంద్రబాబు పేదరికం, ఆర్థిక అసమానతల నిర్మూలనే తన ఆశయమని ప్రకటించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఒక బహిరంగ సభలో తన సంపద రూ.లక్ష కోట్లు అని ప్రకటించిన బాబు, ఈ ఆర్థిక అసమానతల నిర్మూలనకు తనవంతు ఎంత కేటాయిస్తారో చెప్పకుండా, ఆ బాధ్యత మీరంతా తీసుకోవాలని ఎదుటి వాళ్లపై నెట్టేశాడన్నారు. అదేరోజు సాయంత్రం జరిగిన పీ–ఫోర్ ఆవిష్కరణ ఈవెంట్లో రెండు పేద కుటుంబాలను ఒక పక్కన, ముగ్గురు ధనవంతులను మరో పక్కన కూర్చోబెట్టి తాను మధ్యవర్తిగా ఆ పేదలను ఉద్ధరించే బాధ్యతను ఈ ధనవంతులకు అప్పజెప్పినట్లు ప్రకటించి, పేదరికాన్ని రాష్ట్రంలో లేకుండా చేస్తామనడం చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. ఒక వీధి నాటకం లాగా ముగిసిన పీ–4 కార్యక్రమం పేలవంగా సాగటంతో, చిర్రెత్తిన జనం లేచి వెళ్లిపోతుంటే, భరించలేక పేదలకు తూలనాడి, వారిపై తనకున్న చిన్నచూపును ప్రదర్శించి అవమానపరిచారన్నారు. దగాపడ్డ వలంటీర్లు, సంక్షేమ పథకాలు అందని పేదలు ఈ ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు త్వరలోనే వస్తాయన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచాలి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెంచాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. రావిపాడు రోడ్డులోని బృందావనంలో మంగళవారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాల్లో 222 వీఓ సంఘాల పరిధిలో 132 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ విధానం కొనసాగుతుందని తెలిపారు. 2025–26 సంవత్సరంలో జిల్లాలో 82,619 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి సాగు చేపట్టాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్‌లో భాగంగా మొదటగా 56 గ్రామాలు, రెండవ విడతలో 64 గ్రామాలు మొత్తం 120 గ్రామాల్లో నూతనంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను పండించడం వలన జీవకోటికి ఆరోగ్యాన్ని అందించినట్టు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, జిల్లా ఎన్ఎఫ్ఏలు నందకుమార్, సౌజన్య, సైదయ్య, మేరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ ఎయిర్ జిమ్ ప్రారంభం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఆహ్లాదకరమైన వాతావరణంలో నెలకొల్పిన ఓపెన్ ఎయిర్‌జిమ్‌ను ప్రజలు వినియోగించుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ సతీమణి ధరణ్యసతీష్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటుచేసిన ఓపెన్ ఎయిర్ జిమ్, చిన్నారుల క్రీడా పరికరాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అనేక ఒత్తిళ్లు, ఉరుకులు పరుగులతో కూడిన మానవుని జీవితంలో వ్యాయామం తప్పనిసరి అని అన్నారు. నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చునని చెప్పారు. చిన్నారులు ఆడుకునేందుకు ఆటస్థలం ఉందని అన్నారు. వ్యాయామశాల ఏర్పాటుకు సహకరించిన సీసీ ఉప్పాల ఆదిశేషు, జిమ్ శిక్షకుడు కానిస్టేబుల్ శ్రీనివాసరావును ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో శిక్షణా ఐపీఎస్ అధికారిణి దీక్ష, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామ కృష్ణ, పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాయామశాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సతీమణి ధరణ్య సతీష్

ధరణికోటలో చోరీ

అమరావతి: ఒకే ఇంటిలోని రెండు పోర్షన్లలో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని ధరణికోటలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు ధరణికోటలోని పాత హీరోషోరూం వెనుక బజారులో చల్లగండి వరలక్ష్మి ఇంటిలో అద్దెకుంటున్న ఇండియన బ్యాంక్ ఉద్యోగి రమావత్ కవిత గత మూడురోజులు సెలవులు కావటంతో ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో కలిసి ఊరెళ్లారు. అదే విధంగా కిందపోర్షన్‌లో ఉంటున్న ఇంటి యజమాని వరలక్ష్మి సైతం కుటుంబంతో ఊరెళ్లారు. ఈక్రమంలో రెండు పోర్షన్లలో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి కవిత పోర్షన్‌లో రూ.35వేల నగదు, సుమారు 7 గ్రాముల బంగారం, వరలక్ష్మి పోర్షన్‌లో సుమారు 9 గ్రాముల బంగారం చోరీ చేశారు. మంగళవారం ఇద్దరు ఊరునుంచి వచ్చి చూసి, చోరీ జరిగిందని గ్రహించి అమరావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ అచ్చియ్య తన సిబ్బందితో పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు

బర్డ్‌ఫ్లూతో రెండేళ్ల బాలిక మృతి

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన రెండేళ్ల బాలిక బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ 15 రోజుల క్రితం బాలిక మృతి చెందినట్లు సమాచారం. అయితే ఆ బాలికకు చెందిన ల్యాబ్ రిపోర్ట్ రెండురోజుల క్రితం బయటకు రావటం, బర్డ్‌ఫ్లూతోనే బాలిక మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించినట్లు తెలిసింది. బాలికకు బర్డ్‌ఫ్లూ ఏవిధంగా సోకిందనే దానిపై ఆరా తీస్తున్నారు. ఆ పాప కుటుంబ సభ్యులు, ఇంటి చుట్టుపక్కల వారందరికీ పరీక్షలు చేస్తున్నట్లు తెలియవచ్చింది.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు గల్లంతు

అమరావతి: నదిలో చేపలు పట్టటానికి వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన మంగళవారం అమరావతి అమరేశ్వరస్వామి గుడి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు స్థానిక బీసీ కాలనీకి చెందిన పదిమంది యువకులు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చేపలు పట్టేందుకు నదిలోకి దిగారు. నదిలో నీరు లేకపోవటంతో మోకాళ్ల లోతు నీళ్లలో కొంతదూరం నడుచుకుంటువెళ్ళారు. ఈనేపథ్యంలో ఒక్కసారిగా లోతు పెరగటంతో ప్రమాదవశాత్తు యువకులు మునిగిపోసాగారు. వారిలోనే అప్రమత్తమైన కొందరు యువకులు మిగిలిన వారిని రక్షించారు. ఈక్రమంలో నల్లకొట్ల రాజేష్ (19)ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న సీఐ అచ్చియ్య, తహసీల్దార్ డానియేల్ తమ సిబ్బందితో వచ్చి గజఈత గాళ్లతో గాలింపుచర్యలు చేపట్టారు. చీకటి పడేంతవరకు గాలించినా రాజేష్ జాడ తెలియరాలేదు. రాత్రికి గాలింపు చర్యలు నిలిపివేశామని బుధవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామని ఐ.అచ్చియ్య తెలిపారు. గతంలోనే రాజేష్ తండ్రి చనిపోగా తల్లి నదిఒడ్డున తనబిడ్డకోసం గుండెలవిసేలా విలపిస్తుంది.


నల్లకొట్ల రాజేష్ (ఫైల్)

46 ఎకరాల గడ్డివాములు దగ్ధం

తెనాలిరూరల్: అగ్నిప్రమాదంలో సుమారు రూ.ఐదు లక్షల విలువైన 46 ఎకరాల వరిగడ్డి వాములు దగ్ధమైన ఘటన తెనాలి పినపాడు వద్ద మంగళవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా పినపాడు ప్రాంతానికి చెందిన 13 మంది రైతులు ఉమ్మడిగా గడ్డివాములను వేశారు. 46 ఎకరాలు గడ్డిని 15 గడ్డివాములుగా ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించి గడ్డివాములు తగలబడటం ప్రారంభించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిచగా, సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎండ వేడికి దగ్ధమయాయా? లేక ఎవరైనా నిప్పు పెట్టారా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. రైతులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఇక్కడే గడ్డి వాములు వేస్తున్నామని, పంటలు నూర్పి గడ్డిని 13మంది రైతులము కలిసి ఒకచోట వాములు వేశామని, గడ్డికి ఎలా మంటలు వ్యాపించాయో తెలియదని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పిన లాభం లేకుండా పోయిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


దగ్ధమవుతున్న గడ్డివాముల్లో కొంత భాగం

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

మరో యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు

వేటపాలెం: సముద్రం నీటిలో గల్లంతైన యువకుడు మృతి చెందాడు. వేటపాలెం మండల రామాపురం సముద్రతీరంలో మంగళవారం సంఘటన చోటుచేసుకుంది. మెరైన్ పోలీస్‌లు తెలిపిన వివరాల మేరకు... పర్చూరు నెహ్రూకాలనీకి చెందిన చుక్కా వంశీ (26) చిలకలూరిపేట దగ్గరలోని పసుమర్రు గ్రామానికి చెందిన షేక్ రహమతుల్లా ఇద్దరు రామాపురం సముద్ర తీరానికి చేరుకున్నారు. పర్యాటకులతో కలసి ఇద్దరు సముద్రంలో స్నానాలు చేసే సమయంలో ఇద్దరు సముద్రం అలల తీవ్రతకు గల్లంతై కేకలు వేశారు. అక్కడే ఉన్న మెరైన్ పోలీస్‌లు, స్థానిక జాలర్లు వెంటనే స్పందించి ఇద్దరిని కాపాడి నీటిలో నుండి బయటికి తీసుకొచ్చారు. అయితే షేక్ రహమతుల్లా వెంటనే కోలుకున్నాడు. మరో యువకుడు చుక్కా వంశీ సముద్ర నీరు బాగా తాగడంతో పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో అక్కడే సీపీఆర్ చేసి 108లో చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ వంశీ మృతి చెందాడు. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వ్యక్తిపై పెట్రోలు పోసి నిప్పంటించిన మహిళ



క్రోసూరు: మండలంలోని ఉయ్యందన గ్రామంలో తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడన్న కోపంతో వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన సంఘటన మంగళవారం జరిగింది. జరిగిన సంఘటనపై పోలీసుస్టేషన్ రైటర్ దాసు తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన తమ్మిసెట్టి చిరంజీవి అనే వ్యక్తి ట్రాక్టర్‌లో కూర్చుని ఉండగా దేవండ్ల శ్రీలక్ష్మి అనే మహిళ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడనే కోపంతో వెనుకనుంచి వీపుపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టింది. దీంతో వీపు వెనుకభాగం తీవ్రంగా కాలటంతో స్థానికులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గుంటూరు జీజీహెచ్‌లో క్షతగాత్రుడి స్టేట్‌మెంట్ తీసుకుని కేసు నమోదు చేయనున్నట్లు రైటర్ తెలిపారు.

బాలుడిని చంపిన సవతి తల్లి, తండ్రికి రిమాండ్

ఫిరంగిపురం: బాలుడిని చంపిన కేసులో సవతి తల్లికి, తండ్రికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. కొండవీడు గ్రామానికి చెందిన కంచర్ల సాగర్, ఆయన రెండో భార్య లక్ష్మి ఫిరంగిపురం ప్రకాశం పంతులునగర్‌లో ఉంటున్నారు. మొదటి భార్య కుమారులైన కార్తీక్‌ను అడ్డు తొలగించుకోవాలని మార్చి 29న లక్ష్మి అతడిని కర్రతో కొట్టి గొంతుపిసికి చంపివేసింది. మరో కుమారుడు ఆకాష్‌ను పెనంపై కూర్చుపెట్టి వాతలు పెట్టింది. దీనికి భర్త సాగర్ సహకరించాడు. ఈ ఘటనపై పిల్లల మేనత్త విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈఘటనపై సీఐ రవీంద్రబాబు నిందితులు లక్ష్మి, సాగర్‌ను సోమవారం సాయంత్రం అరెస్టుచేశారు. నరసరావుపేట రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వద్ద మంగళవారం హాజరుపర్చారు. వారికి ఈనెల 11 వరకు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వలస కూలీల ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు


తీవ్రంగా గాయపడిన వలస కూలీలు


ప్రమాదానికి కారణమైన కళాశాల బస్సు

నలుగురికి తీవ్ర గాయాలు

మేడికొండూరు : విశదల సమీపంలోని ఎన్నారై కళాశాల వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వలస కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కథనం ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన కూలీలు మేడికొండూరు మండల పరిధిలోని సరిపుడి గ్రామంలో గుడారాలు నిర్మించుకొని నివసిస్తున్నారు. రోజూ కూలి పనుల కోసం పొన్నూరు వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం కూడా తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పేరేచర్ల గ్రామ శివారు దాటిన తర్వాత ఎన్నారై కళాశాల సమీపంలో అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న ప్రైవేట్ బస్సు కూలీల ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో ఒక్కసారిగా పల్టీ కొట్టి పక్కకు బోల్తా పడింది. ప్రమాదంలో తుపాకుల జయమ్మ, తుపాకుల సుబ్బారావు, మాణిక్యమ్మ, తుపాకుల లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంతో చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ తెలిపారు.

కళాశాల బస్సును దొంగిలించి ఆటోను ఢీకొట్టాడు ...

వలస కూలీలను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిన బస్సు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు అది ఎన్నారై కళాశాలకు చెందిన బస్సుగా తెలిసింది. ఈ బస్సును పేరేచర్ల జంక్షన్ వద్ద ఆపి డ్రైవర్ మందులు కొనుక్కుంటుండగా గుర్తుతెలియని వ్యక్తి నడుపుకొంటూ తీసుకెళ్లిపోయాడు. దీంతో డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన మేడికొండూరు పోలీసులు పల్నాడు జిల్లా లింగం కళాశాల సమీపంలో బస్సును అదుపులోకి తీసుకొని దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేశారు. బస్సు దొంగిలించిన వ్యక్తి జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పొన్నపోలు నాగేశ్వరరావు అని గుర్తించారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు గంట వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

తల్లిని కొడుతున్న కొడుకుపై కేసు

పెరవలి(వేమూరు): ఇల్లు అమ్మి డబ్బులు ఇవ్వాలని తల్లిని కొడుతున్న కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ రవి కృష్ణ తెలిపారు. వేమూరు మండలం పెరవలి గ్రామానికి చెందిన అమిరే వీర కుమారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇరువురికి పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడు అమిరే వీర బసవయ్య తల్లిని ఇల్లు అమ్మి డబ్బులు ఇవ్వాలని రోజు కొడుతున్నాడు. దీంతో తల్లి మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.